## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గండిపేట్, : సూర్య ప్రతినిధి



ఆర్థిక కారణాలతో వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మైలార్ దేవ్ పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ టీఎన్జీవోఎస్ కాలనీలో నివాసముండే ఆనంద్ రెడ్డి(41) ఆర్థిక సమస్యల నేపథ్యంలో తన రూమ్ లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆనంద్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

## బీజేఎంసీలో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రత్యేక దృష్టి

**కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర**




గండిపేట్, : సూర్య ప్రతినిధి

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతుందని కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర తెలిపారు. కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్పోరేషన్ పరిధిలో ఒకటవ డివిజన్ లోని శివసాయి నగర్ కాలనీలో తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు కమీషనర్ బి.శరత్ చంద్ర అవగాహన కల్పించారు. 2 వ డివిజన్ లోని గాయత్రీనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. కార్పోరేషన్ లో పారిశుద్ధ్య నిర్వాహణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జీ.యాదయ్య, ఏఈఈ వీ.రాజ్ కుమార్, ఐసీ ఎస్ఐ జీ.వెంకట్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ ఆదర్శ్ కుమార్ పాల్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఆర్పీలు, శానిటరీ జవాన్లు సిబ్బంది పాల్గొన్నారు.

## కాండూట్ పైపులైన్ లీకేజీ సమస్యకు పరిష్కారం అభినందించిన బీఆర్ఎస్ నాయకులు

గండిపేట్, : సూర్య ప్రతినిధి




గండిపేట్ కాండూట్ పైప్ లైన్ ద్వారా వృధాగా నీరు కారుతున్న విషయంపై అధికారులు స్పందించడాన్ని బీఆర్ఎస్ నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సమస్యపై పలుమార్లు అధికారులు దృష్టికి తేవడం జరిగిందని, ఈ మేరకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ వారు దిద్దుబాటు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఔత్సాహిక సామాజిక కార్యకర్త చార్టెడ్ అకౌంటెంట్ పునీత్ తివారి, మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు మున్సిపల్ అధికారులు, ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

## మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి



గండిపేట్, : సూర్య ప్రతినిధి

మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తుందని మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలపై, బిఆర్ఎస్ పార్టీ పట్ల కమిషనర్ చూపుతున్న పక్షపాత వైఖరిని ఖండించి నిరసన తెలిపారు. ఈ మేరకు స్థానిక మున్సిపాలిటీ కార్యాలయానికి మూకుమ్మడిగా ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పుప్పాలగూడలో అంబేద్కర్ భవన్ నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు ఎలాంటి స్పందన రాలేదని, ఈ రకమైన ధాటివేత ధోరణిని ఖండిస్తున్నామని వివరించారు. పుప్పాలగూడ స్మశానవాటిక రహదారిని ఈఐపిఎల్ సంస్థ ఆక్రమించుకొని తమ ఆర్ఎంసి ప్లాంట్ ను నిర్వహిస్తున్నా పురపాలక సంఘం అధికారులు నిమ్మకునీరెత్తిన్నట్లు చేస్తున్నారని మండిపడ్డారు. గడచిన ఆరు నెలల నుంచి స్పెషల్ ఆఫీసర్ వ్యవస్థ నడుస్తున్నప్పటికీ స్పెషల్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడం, పురపాలక సంఘం గత పాలకవర్గంపై ఆధారపడే విధానాన్ని ఖండిస్తున్నామని, స్పెషల్ ఆఫీసర్ కనీసం వారంలో ఒక రోజైనా మణికొండలో ప్రజా అవసరాల కోసం ఉండాలని డిమాండ్ చేశారు. వీధి శునకాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం, వాటి సంరక్షణ కొరకు షెల్టర్ హోం నిర్మించడంపై చర్యలు చేపట్టకపోవడం విచారం వ్యక్తం చేశారు. అధ్వానంగా తయారైన రోడ్లను, ట్రైల్స్ గేటెడ్ కమ్యూనిటీ ఎదురుగా ఉన్న బాక్స్ డ్రెయిన్, రోడ్డును ప్రజావసరాలకు అందుబాటులోకి తీసుకురానందుకు తీవ్ర నిరసన తెలియజేస్తున్నామన్నారు. మణికొండ ముఖ్య కూడల్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుత కాలమాన ప్రకారం క్లౌడ్ బర్స్ట్ లేక వాతావరణ మార్పుల కారణంగా కుండపోత వర్షాలు పడితే ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ సరిపోదన్నారు. కావున మణికొండకు పూర్తిస్థాయిలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉన్న దరిమిలా పూర్తిస్థాయి మురికినీటి వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ ను స్థానిక భారత రాష్ట్ర సమితి నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సీతారాం దులిపాల, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగల ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీద నరేందర్, మహిళా అధ్యక్షురాలు పట్లోల రూపా రెడ్డి, బొమ్ము ఉపేందర్ నాథ్ రెడ్డి, అందే లక్ష్మణరావు, సంఘం శ్రీకాంత్, మహమ్మద్ ఆరిఫ్, సుమనలిని, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.......

## వెరీజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

గండిపేట్, : సూర్య ప్రతినిధి



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం వెరీజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైటెక్ సిటీ మైండ్ స్పేస్ వారు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. అత్తాపూర్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారి సహకారంతో సీఆర్ఎస్ ఫండ్ తో సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ ల్యాబ్ లో ఆరవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. వెరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారాన్ని స్వాగతిస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే పరికరాలను అందించాలని కోరారు. అనంతరం ఆరో తరగతి విద్యార్థులకు ఒక స్కూల్ బ్యాగ్ తో పాటు వారికి సరిపోయిన స్టేషనరీ మొత్తాన్ని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెరీ జాన్ సర్వీసెస్ ప్రతినిధులు పంకజ్ సింగ్, వెంకటరఘురామ్, సంతోష్ విశ్వనాథ్,సందీప్, డానిష్ లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సాయిప్రసాద్ రావు, రోజా రాణి, శ్రీనివాస సాగర్ సురేష్, హాసిని తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పోచమ్మ ఆలయానికి కుర్చీలు, టేబుళ్లు అందజేత

గండిపేట్, : సూర్య ప్రతినిధి



రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతి పేట్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మ దేవాలయం అభివృద్ధికి తమ వంతుగా కృషి చేయడం జరుగుతుందని జయంతి ఉత్సవాల వ్యవస్థాపకులు పోయిల జీవన్ దాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యంలు అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ కోశాధికారి మంగలారం శ్రీనివాస్ అమ్మవారి ఆలయంకు 10 కుర్చీలు,2టేబుల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి కరుణా, కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయం కార్యవర్గం సభ్యులు లేవిరాజ్, ఎడ్లకాడి చంద్రశేఖర్, గోల్కొండ ఉపేందర్, బిఆర్.సుమన్, కవ్వగూడెం గౌతమ్, జనార్ధన్, గోల్కొండ నాని, గడ్డం సత్తయ్యలకు కుర్చీలు, టేబుల్స్ అందజేశారు.

## మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

**నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

గండిపేట్, : సూర్య ప్రతినిధి



రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ఎజెండా అని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మోహన్ రెడ్డి నగర్ లో స్థానికుల విజ్ఞప్తి మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సీసీ రోడ్డు పనులకు నూతన ప్రణాళికలు వేసి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ వ్యవస్థ దెబ్బ తినడంతో నూతన పైప్ లైన్ కొరకు చర్యలు చేపట్టాలని, రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దేవాలయం పరిసర ప్రాంతాలలో ప్యాచ్ వర్క్ పనులు మరమత్తు పనులు విద్యుత్ దీపాలు తదితర అన్ని పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పండగ వేళ ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్ వైజర్ లోక్ నాథ్, రామ్ కీ సిబ్బంది నరసింహ, సంతుగౌడ్, కురుమూర్తి, రోహిత్, అశోక్, రాహుల్, నాని, బబ్లూ, ఎన్ను శంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సంతోష్, రాజు, నటరాజ్, లక్ష్మణ్, విష్ణు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి కవిత**

గండిపేట్,: సూర్యా ప్రతినిధి




అంగన్ వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి కవిత అన్నారు. శేరిలింగంపల్లి ప్రాజెక్టులో అంగన్ వాడీ లోకల్ సమస్యల పరిష్కారం కోసం సిడిపిఓ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమాన్ని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి కవిత హాజరై ఆమె సిడిపిఓ కవితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ మండలం గండిపేట మండలం శేర్లింగంపల్లి మండల పరిధిలో అంగన్వాడీ సెంటర్ కు సంబంధించిన గ్యాస్ కన్స్యూమర్ నంబరు కోసం పై అధికారులు రూ.2500 చెల్లిస్తేనే గ్యాస్ కన్స్యూమర్ నెంబర్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, ఫేస్ క్యాప్చర్ కాకపోతే లబ్ధిదారులైన పిల్లలకు వారి కుటుంబాలకు సంబంధించిన పుడ్డు ఎగ్స్ బాలామృతం ఇవ్వకూడదని సూపర్వైజర్లు చెబుతా ఉన్నారన్నారు. బస్తీల్లో పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడీ సెంటర్లోకి వచ్చి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తూ గొడవకు దిగుతున్నారు. ఆ సమస్య వల్ల పెండింగ్ లో ఉన్న గ్యాస్ వెజిటేబుల్ ఆరు నెలల స్కూలు రెంట్లు, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ఫేస్ క్యాప్షన్, ఆన్లైన్ ను ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే ఆన్లైన్ పనిచేస్తుందన్నారు. దాని తర్వాత ఆన్లైన్ విధానం పనిచేయక తీవ్ర ఇబ్బంది సూపర్వైజర్లు వేధింపులు అరికట్టాలన్నారు. సూపర్వైజర్లు ఫోన్ చేసినప్పుడు అప్పుడు ఫోన్ ఎత్తకపోతే దాన్ని భూతద్దంలో పెట్టి చూయిస్తూ అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారు. పై అధికారులకు స్క్రీన్ షాట్ తీసి ఫోన్ చేయట్లేదని ఇబ్బంది పెడుతున్నారన్నారు. పక్కా భవనాలు లేక ప్రభుత్వం ఇచ్చే కిరాయిలు సరిపోక అంగన్వాడి స్కూల్లో నిర్వహించాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. అంగన్వాడి టీచర్స్ కు అనేక ఆన్లైన్ పనుల కోసం టీచర్లకు ట్యాబులు అందించాలన్నారు. పక్కా భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎన్ హెచ్ టి ఎస్ యాప్ ను రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న ఒక నెల వేతనం వెంటనే చెల్లించాలని చర్చించగా చర్చలు నిర్వహించడం జరిగిందన్నారు. కొన్ని సమస్యలను సిడిపిఓ సానుకూలంగా స్పందించి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా నాయకులు బచ్చలకూర స్వామి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నాగమణి, సుధారాణి, అనిత, షమీం బేగం, సుమలత, రజిత, గౌసియా, భాగ్య, వీరితోపాటు అంగన్వాడీ టీచర్స్ అందరూ పాల్గొన్నారు.

## భారీ వర్షం... నేలమట్టమైన ఇల్లు పై కప్పు

**తప్పిన ప్రాణ నష్టం**

**ప్రభుత్వం ఆదుకోవాలని ఎదురుచూపులు**

ప్రభాత సూర్య ప్రతినిధి, మర్రిగూడ:



శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఓ పేద కుటుంబం ఆశ్రయాన్ని కోల్పోయింది. దీంతో పొరుగువారి ఇంట్లో తల దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుకుంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున సుమారుగా ఒక 1గంట పాటు ఎడతెరిపి లేకుండా మండలంలో కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు పై కప్పు నేలమట్టం అయింది. మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన కంచుకట్ల రఘు అనే కుటుంబం ఇంటి పైకప్పు నేల మట్టమయింది. వర్షం కారణంగా ఈ కుటుంబం ఆశ్రయాన్ని కోల్పోయింది. ఇంట్లోని ఆహార పదార్థాలు వర్షానికి పాడైపోయాయి. అదృష్టవశాత్తు కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు..

## భారీ వర్షంతో రైతన్నల ఆశలు చిగురించాయి

**ఆనందం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు**



ప్రభాత సూర్య ప్రతినిధి,మర్రిగూడ:

శుక్రవారం తెల్లవారుజామున మండలంలో కురిసిన వర్షాలకు రైతన్నలలో పంటల సాగుపై ఆశలు చిగురి స్తున్నాయి. నెలరోజుల క్రితం నుంచే భూము లను దుక్కి దున్నుకొని పంటలు సాగు చేసేందుకు సమాయత్తం చేశారు. అప్పటి నుంచి వర్షం ఎప్పుడు వస్తుందా.? అని ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్న సమయంలో ఒక్కసారిగా రైతన్నలలో ఆశలు చిగురించాయి. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలో శుక్రవారం తెల్లవారుజామున వర్షం ఉధృతంగా పడడంతో ఇక ఏడాది పంటలు సాగు చేసుకునేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. దీంతో బీటలువారి నెర్ర లిచ్చిన భూములన్నీ పదునెక్కాయి. పొలాల్లో, కాలువల్లో నీళ్లు నిలిచి కళకళలాడుతున్నాయి. వర్షాలతో తాగునీటి బోర్లలో జలాలు పెరిగి నీటికష్టాలు తీరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు...

## సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ పై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**-ఫిర్యాదు చేసిన రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు**




ఖమ్మం( సూర్య ప్రతినిధి)

ఖమ్మం జిల్లా పర్యటనలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అప్రజాస్వామిక పదజాలముతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ పై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ చేసిన రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మలోత్ రాము నాయక్ ధరవత్ రామ్మూర్తి నాయక్ లావుడియా రవి(ఆత్మ డైరెక్టర్)బానోత్ జంపా భూక్యా ఉపేందర్ నాయక్ భూక్యా మంగీలాల్ నాయక్ మలోత్ శంకర్ అడ్వకేట్ సైదేశ్వరావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**-కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**

ఖమ్మం ( సూర్య ప్రతినిధి)



ముఖ్యమంత్రి పై మాట్లాడే ముందు కేటీఆర్ ఇంగిత జ్ఞానం తో మాట్లాడాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఖమ్మం జిల్లాకి ఏమి చేసారో మా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏమి చేసిందో తెల్సుకుందామీ నాయకుల్ని గ్రామల్లోకి పంపించండన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని ఆయన తెలిపారు.జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులపై కేటీఆర్ మాట్లాడిన మాటలపై ఆయన మండిపడ్డారు.ఇంకోసారి కేటీఆర్ భాష మార్చుకోక పోతే ఖమ్మం జిల్లా ప్రజలు గతంలో మూడు సార్లు బుద్ధి చెప్పారని నాలుగోసారి కూడా బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

